క్లుప్తంగా

నేడు వేలంపాట

పుంగనూరు: మున్సిపాలిటీకి చెందిన వారపు సంత, కూరగాయల మార్కెట్, బస్టాండు, మరుగుదొడ్లు, ఖాళీ రూములకు వేలంపాట గురువారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆసక్తి గల వ్యాపారులు ధరావత్తు చెల్లించి, వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

పింఛన్ల పంపిణీ

పుంగనూరు: పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కమిషనర్ నరసింహాప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నిర్వహించారు. వేకువజామున నుంచి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించారు. 97 శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. అలాగే మండలంలో 92 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రాజేశ్వరి తెలిపారు.

మండల మీట్ రేపు

సోమల: మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగరాజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కమ్యూనిటీ భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు అధికారులు తప్పక పాల్గొనాలని కోరారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

గంగవరం: మండలంలోని కీలపట్ల గ్రామానికి చెందిన వివాహిత, తన భర్త విజయ్‌కుమార్ వరకట్న వేధింపులకు గురి చేస్తున్నాడంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధువారం ఫిర్యాదు చేసింది. చాలా ఏళ్లుగా పుట్టింటి నుంచి కట్నం తీసుకురావాలంటూ భర్త వేధింపులకు గురి చేసేవాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. భర్త వేధింపులపై వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి మార్కింగ్

సోమల: మండలంలోని పొదలగుంటపల్లె పంచాయతీ తుగడంవారిపల్లె, పొదలగుంట పల్లె గ్రామంలో నూతనంగా మంజూరైన 60 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి బుధవారం అధికారులు స్థల పరిశీలన చేసి మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, సర్పంచ్ జయరాం, కాంట్రాక్టర్ రాయల్ జగదీష్, మైనారిటీ నేత ఇంతియాజ్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

కుప్పం: మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న వారు 2022–23 సంవత్సరానికి సంబంధించి పన్నులు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రవిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం, నీటి పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. సకాలంలో చెల్లించకపోతే పురపాలక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటనలో పేర్కొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

పలమనేరు: మండలంలోని మాదిగబండ అటవీప్రాంతంలో రహస్యంగా ఆడుతున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న 13 మందిని అరెస్ట్ చేసి మూడు కోడిపుంజులు, తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ.900 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. వీరిని స్థానిక కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

మాణిక్యమ్మకు నివాళి

గంగవరం: మండలంలోని కల్లుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు యుగంధర్‌నాయుడు నాయనమ్మ కంచర్ల మాణిక్యమ్మ(87) మంగళవారం మృతి చెందారు. ఆమె మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ కల్లుపల్లికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చలపతిరెడ్డి, వేణురెడ్డి, వెంకటరమణనాయుడు ఉన్నారు.

వార్డు మెంబర్ రామనాథంరెడ్డి మృతి


రామనాథంరెడ్డి(ఫైల్)

చౌడేపల్లి: పరికిదొన గ్రామ పంచాయతీ మడుకూరుకు చెందిన 1వ నంబర్ వార్డు మెంబర్ రామనాథంరెడ్డి (47) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రామనాథంరెడ్డి మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు దామోదర్ రాజు, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ శ్రీరాములు తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఇక్కడ బెయిలు.. అక్కడ జైలు

- పలమనేరు, కుప్పంలో బెయిలు మంజూరైనా మదనపల్లె జైలుకు వెళ్లాల్సిందే
- అక్కడికి వెళ్లేసరికి మించిపోతున్న సమయం
- మరుసటి రోజుకు వాయిదా పడుతున్న ముద్దాయిల విడుదల
- పలమనేరులో సబ్‌జైలు నిర్మాణానికి స్థలం కేటాయింపులో అధికారుల మీనమేషాలు
- ఖైదీల కుటుంబీకులకు తప్పనితిప్పల



పలమనేరులో ఐదేళ్ల కిందట మూతపడిన సబ్‌జైలు

పలమనేరు: తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన ఓ ముద్దాయికి ఇటీవల పలమనేరు కోర్టులో బెయిల్ మంజూరైంది. అది కూడా బెయిల్ ఆర్డర్ సాయంత్రానికి సిద్ధం అయింది. దాన్ని అతని కుటుంబీకులు తీసుకుని మదనపల్లి సబ్‌జైలుకు వెళ్లారు. అయితే సాయత్రం ఐదు తరువాత ముద్దాయిని జైలు నుంచి పంపడానికి నిబంధనలు ఒప్పుకోవని అక్కడి జైలర్ తెలిపాడు. దీంతో బాధిత కుటుంబీకులు మదనపల్లెలో రాత్రి పూట ఉండేందుకు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చింది. గత ఐదేళ్లుగా పలమనేరు కోర్టు పరిధిలోని ముద్దాయిల కుటుంబాలకు ఇలాంటి కష్టాలు తప్పడం లేదు. మదనపల్లె సబ్‌జైల్ నుంచి పలమనేరు, కుప్పం కోర్టులకు వాయిదాలకు ఖైదీలను తీసుకురావడానికి పోలీసులకు సైతం కష్టతరంగా మారింది. వాయిదా సమయానికి ముద్దాయిలను ప్రవేశపెట్టడం వారికి కుదరడం లేదు. దీనికి కారణం పలమనేరులో సబ్‌జైలు లేకపోవడమే. తాజాగా బెయిల్ పొందిన ఉత్తర్వులను మెయిల్ చేస్తున్నా నిందితుల బంధువులకు మాత్రం వ్యయప్రయాసలు తప్పడం లేదు.

అటకెక్కిన కొత్త సబ్‌జైలు నిర్మాణం

పలమనేరు పట్టణంలో కొత్త సబ్‌జైల్ నిర్మాణ పనులు కొండెక్కాయి. బ్రిటీష్ కాలం నాటి ఓ భవనంలో గతంలో ఇక్కడ సబ్‌జైల్ నిర్వహించేవారు. ఇందులో 25 నుంచి 30 మంది ఖైదీలను ఉంచేవారు. అది కూడా ఇబ్బందికరంగానే ఉండేది. భవనాలు ఉరుస్తుండడంతో పాటు కాలం చెల్లిన భవనాలు కావడంతో పైకప్పుతో ఎక్కడ కూలిపోతుందోనని, ఇక్కడున్న ఖైదీలను మదనపల్లె సబ్‌జైలుకు ఐదేళ్ల కిందట తరలించారు. అప్పట్లోనే కొత్త సబ్‌జైల్ నిర్మాణానికి ఆ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. అయితే కొత్తజైలు నిర్మాణానికి అక్కడున్న స్థలం చాలదని, ప్రభుత్వ స్థలం కోసం రెవెన్యూశాఖకు పోలీస్ శాఖ అధికారులు విన్నవించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి దాకా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో నిధులు అప్పట్లోనే వెనక్కి వెళ్లాయి. దీంతో ఈ పనులు ముందుకు సాగలేదు. కుప్పం నుంచి పలమనేరు దాకా పది మండలాలకు ఇదొక్కటే సబ్‌జైలుగా ఉండేది.

మదనపల్లెకు వెళ్లడానికి పాట్లు..

ప్రస్తుతం ఖైదీలను కలుసుకోవాలంటే వారి కుటుంబీకులు, బంధువులు వ్యయప్రయాసలకు ఓర్చి ఈ ప్రాంతాల నుంచి మదనపల్లెకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త సబ్‌జైలు నిర్మాణానికి పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ


లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లె పంచాయతీ అగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాజారెడ్డి, సర్పంచ్ మురళీరెడ్డి తల్లి లక్ష్మమ్మ(95) వయోభారంతో మృతి చెందారు. ఆమె మృతదేహానికి మంత్రి పెద్దిరెడ్డి బుధవారం నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, అమాస మోహన్, నాగేశ్వరరావు, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

సుబ్రమణ్యంకు పరామర్శ


సుబ్రమణ్యంను పరామర్శిస్తున్న చైర్మన్ శంకర్‌నారాయణ

చౌడేపల్లి: యువకుల దాడిలో గాయపడిన బోయకొండ గంగమ్మ ఆలయ ఉద్యోగి సుబ్రమణ్యంను ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ బుధవారం పరామర్శించారు. మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్రమణ్యం ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఉద్యోగిపై దాడికి పాల్పడ్డానికి గల కారణాలపై చైర్మన్ ఆరా తీశారు. ఆయన వెంట నేతలు వెంకటరెడ్డి, రెడ్డెప్ప ఉన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి

బైరెడ్డిపల్లె : వడదెబ్బ నివారణపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి సూచించారు. మండలంలోని తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని దేవదొడ్డిలో బుధవారం వడదెబ్బ నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండలు అధికంగా ఉంటాయని, ఆరుబయట తిరగరాదన్నారు. అలాగే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని మేకలనాగిరెడ్డిపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు.

శరవేగంగా పింఛన్ల పంపిణీ


నడిగడ్డలో పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ

సదుం: మండలంలోని 18 పంచాయతీల పరిధిలో బుధవారం వేకువజామున నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఉదయాన్నే వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందిచండంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియన వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పలమనేరు: మండలంలోని గొల్లపల్లి వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లికి చెందిన మునెప్ప (45) మృతి చెందాడు. ఇతను పలమనేరు నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం


పుంగనూరు: సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దళితనేతలు

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు దళిత నేతలు పాలాభిషేకం చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత నాయకులు రాజు, శంకరప్ప, కృష్ణప్ప ఆధ్వర్యంలో చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి ఏటా ఆర్థికసాయం అందిస్తూ ఆదుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో చిన్నరాయుడు, బాలాజి, విజయ్, అశోక్, నరసింహులు, రామ్మూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.

చిన్నశేషవాహనంపై శ్రీవారి ఊరేగింపు



పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద గల కల్యాణ వేంకటేశ్వర స్వామిని ఉదయం చిన్నశేషవాహనంపై ఊరేగించారు. స్వామి, అమ్మవార్లను మూడవ రోజు బుధవారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం హంసవాహనంపై స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో హాజరై పూజలు చేశారు. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల కోసం స్వామివారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

రొంపిచెర్ల: స్పందన ఫిర్యాదులను అధికారులు సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ అమరనాథ్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో స్పందన ఫిర్యాదులపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు స్పందించాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు పని చేయాలన్నారు. స్పందనపై అధికారులు నిర్లక్ష్యం చూపితే వేటు తప్పదన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్ర, పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, పశువైద్యాధికారి శ్రీధర్, ఏఎస్‌ఐ తులసీరామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



వనభోజనాల్లో పాల్గొన్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

- వేడుకల్లో పాల్గొన్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన శ్రీ మళాలమ్మ (చాముండేశ్వరీ దేవి) ఆలయంలో నాలుగో వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి అభిషేక, పూజలు చేపట్టారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. మళాలమ్మ అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా ఆఖరిరోజు జరిగిన పచ్చ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వేడుకల్లో ఆలయ ధర్మకర్త చంద్రప్ప, మండల పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, నాయకులు శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, పవన్‌కుమార్, బాలకృష్ణ, రాఘవ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన


వి.కోట : ప్రత్యేక పూజల్లో పాల్గొన్నఎమ్మెల్యే

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లి గ్రామంలో బుధవారం చౌడేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ యువరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. చింతమాకులపల్లిలో నూతనంగా చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం నిర్మించారు. అందులో భాగంగా ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో గణపతి ప్రార్థన, ప్రాణప్రతిష్ఠాపన హోమం, దుర్గాహోమం, పూర్ణాహుతి, పంచామృత అభిషేకం, కుంభాభిషేకం, మహామంగళ హారతులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గోపిరెడ్డి, సర్పంచ్ రామచంద్రప్ప, నాయకులు మధు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి


సచివాలయ కన్వీనర్లతో మంత్రి పెద్దిరెడ్డి

సదుం/సోమల: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సచివాలయాల మండల కన్వీనర్లకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. సదుం, పులిచెర్ల, సోమల సచివాలయాల కన్వీనర్లు ప్రకాష్‌రెడ్డి, మురవత్ బాషా, రాశెట్టి మధు బుధవారం తిరుపతిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, టీచర్లను కలిసి పార్టీకి మద్దతు పలికేలా చూడాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని అన్నారు. అలాగే పార్టీ పటిష్టతకు కష్టపడుతున్నారని వారిని ఆయన అభినందించారు.

వివాహ వేడుకలో మంత్రి పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెకు చెందిన రాజారెడ్డి కుమారుడు జయకుమార్‌రెడ్డి వివాహం స్థానిక టీటీడీ కల్యాణమండపంలో బుధవారం జరిగింది. ఈ వేడుకలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించండి


రిజిస్టర్లను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులకు పూర్తిస్థాయిలో అధికారులు చేర్చినప్పుడే నిజమైన అభివృద్ధి కనబడుతుందని జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని అంబేడ్కర్ నగర్ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రిజిస్టర్లు, మూమెంట్ రిజిస్టర్, సిబ్బంది హాజరు, స్పందన ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం తప్పనిసరిగా స్పందన నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చిన వినతులను అలసత్వం వహించకుండా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలు అర్హులకు తప్పనిసరిగా అందించాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ


పలమనేరు: ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు

కుప్పంరూరల్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 94శాతం ఉత్తీర్ణత సాధించి జోన్‌లోనే మొదటిస్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. బీకామ్, బీఎస్సీ కంప్యూటర్స్, హార్టికల్చర్, పారామెడికల్ కోర్సుల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. బీకాం కంప్యూటర్స్‌లో తరుణ్‌కుమార్, బాలాజీ, పవిత్ర, ఇమ్రాన్, సుమయ్య, ఆర్ట్స్‌లో శ్రావణి, సంధ్య, శిరీష, కల్పన, సంపూర్ణ, జయశ్రీ 8 నుంచి 10 వరకు గ్రేడ్లు సాధించినట్లు తెలిపారు. మంచి ఫలితాలు రావడానికి కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులకు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు.

కార్పొరేట్ విద్యార్థుల ప్రతిభ

పలమనేరు: గత అక్టోబరులో జరిగిన డిగ్రీ ద్వితీయ సంవత్సర నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన శ్రీవాణి, పద్మావతి డిగ్రీ కళాశాలల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించినట్టు కళాశాలల కరస్పాండెంట్ బాలసుందరం రెడ్డి బుధవారం తెలిపారు. బీఎస్సీ ఎంఈసీఎస్‌లో హేమలత 86 శాతం, కరుణాకర్‌రెడ్డి 84 శాతం, దివ్యప్రసన్న 83 శాతం, బీఎస్సీ బీజెడ్‌సీలో జైభాకౌసర్ 93 శాతం, సానిత 90 శాతం, అక్షయ 86 శాతం, బీకాంలో శ్రావణి 87 శాతం, హారిక, మధు, హేమావతి, లక్ష్మీదేవి 85 శాతం సాధించినట్టు చెప్పారు. విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని కళాశాలల ప్రిన్సిపల్స్ కృష్ణమూర్తి రెడ్డి, శ్రీవాణి అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి


విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పెద్దిరెడ్డి

సదుం: త్వరలోనే పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ అన్నారు. మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు నమోదు అవుతున్నాయని, ఈసారి కూడా అవి పునరావృతం అయ్యేలా కష్టపడి చదవాలని కోరారు. ఫలితాల సాధనలో పాఠశాల మంచి గుర్తింపు పొందడం అభినందనీయమని, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఆశీర్వదించారు. పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి రైతులు అపోహలు వీడాలి


పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చందనప్రియ

సోమల: పాడి రైతులు అపోహలు వీడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని వల్లిగట్లలో గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గాలికుంటు వ్యాధి నివారణ వారోత్సవాలను బుధవారం నుంచి ఈ నెల 31 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి సోకితే తీవ్రమైన జ్వరం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గుతుందని అన్నారు. అలాగే పాడి పశువుల్లో పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం వల్ల రైతులకు ఆర్థికంగా నష్టం కలగవచ్చని తెలిపారు. అలాగే పాలు తాగే దూడల మరణాలు, వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల పశువులు చనిపోవడం జరుగుతుందన్నారు. టీకాలు వేయించడం వల్ల వ్యాధి సోకిన పశువుల్లో తగ్గిన పాల ఉత్పత్తి శాశ్వతంగా నివారించవచ్చని పేర్కొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పలమనేరు: త్వరలో జరిగే పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్లను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలను గమనించారు. ఓటింగ్ సమయంలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఈ సందర్భంగా వారు గమనించి అవసరమైన చర్యలను తీసుకోనున్నట్టు తెలిపారు. ఇందులో తహసీల్దార్ కుప్పుస్వామి, ఎస్‌ఐ నాగరాజు, ఎంపీడీఓ విద్యాసాగర్‌తో పాటు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజమాతకు సనాతన ధర్మ భారతి పురస్కారం

తిరుపతి కల్చరల్: సేవ్ టెంపుల్ భారత్, వేద విజ్ఞాన సమితి సంయుక్తంగా గురువారం సాయంత్రం 5 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో రాజమాత తీరునల్ గౌరీ లక్ష్మీబాయికి సనాతన ధర్మ భారతి స్ఫూర్తి పురస్కారం అందజేయనున్నట్టు నిర్వాహకుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం తిరుపతి సమాజ కార్యాలయాన్ని సందర్శించి పురస్కార ప్రదాన సభ గురించి చర్చించారు. ఇందులో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి, స్వాత్మానందేంద్ర స్వామి, ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు భూమన, చెవిరెడ్డి, బియ్యపు పాల్గొంటారని తెలిపారు.

ఇంద్రియ నియంత్రణతో లక్ష్య సాధన

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంద్రియ నియంత్రణతోనే లక్ష్యాన్ని సాధించవచ్చని ముంబైకి చెందిన భక్తి వేదాంత విద్యాపీఠ డీన్ గౌరవ్‌దర్శన్ దాస్ తెలిపారు. మహిళా వర్సిటీలో బుధవారం స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఫ్రం డిస్ట్రక్షన్ టు కాన్సంట్రేషన్ అనే అంశంపై ప్రేరణా తరగతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యాచరణపై పూర్తి శ్రద్ధ చూపకుంటే లక్ష్యాన్ని అధిగమించలేరన్నారు. అనుకూలత లేని మల్టీ టాస్కింగ్ ఆశించిన ఫలితాలు ఇవ్వదని తెలిపారు. పంచేంద్రియాలు మనసును పరిపరి విధాలుగా ఆలోచించేలా చేస్తాయని, మేధస్సు ద్వారా ఇంద్రియ నిగ్రహం సాధించి సరైన దిశగా సాగాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ శారద, మహిళా అధ్యయన విభాగాధిపతి నీరజ, ప్రొఫెసర్ అనురాధ, నిర్మల పాల్గొన్నారు.